క్లుప్తంగా

శాఖా గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



శాఖా గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కార్యదర్శి వెంకటరావు

అల్లిపురం: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి పేపర్ విభాగం, మేడపైన గల పుస్తక విభాగాన్ని సందర్శించారు. రికార్డులు నిర్వహిస్తున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకులతో మమేకమయ్యారు. గ్రంథాలయంలో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాల గురించి ఆరా తీశారు. గ్రంథాలయంలో పొందుపరిచిన కాంపిటీటివ్ పుస్తకాల గురించి విస్తృత ప్రచారం చేయాలని గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజుకు సూచించారు. సభ్యత్వాలు పెంచుకోవాలని కోరారు.

తీరంలో స్వచ్ఛభారత్



తీరాన్ని శుభ్రం చేస్తున్న యువత

బీచ్ రోడ్డు: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని యువతీ యువకులు గురువారం సాగరతీరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో ఉన్న చెత్తను సేకరించి జీవీఎంసీ సిబ్బందికి అప్పగించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువతీ యువకులు

బీచ్ రోడ్డు: పర్యావరణ పరిరక్షణ కోసం అందరం కలసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని నినదిస్తూ గురువారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గ్లోబల్ క్లైమేట్ స్ట్రైక్ పేరుతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెట్ల నరికివేత, జంతు హింస, ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం వల్ల వాతావరణం కాలుష్యమై పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



మహిళా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వర్సిటీ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా నిర్వహించనున్నట్టు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. తెలుగు విభాగాధిపతి అప్పారావు మాట్లాడుతూ వర్సిటీ అసెంబ్లీ హాల్‌లో నిర్వహించే ఈ వేడుకలో విశిష్ట మహిళలను సన్మానిస్తామన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ఆక్రమణల అడ్డు

- మురుగు కాలువ మీదుగా వస్త్ర దుకాణాల ఏర్పాటు
- చెత్త తొలగించే వీలు లేక ఇబ్బందులు



పందుపుల్లల సందులోని ప్రధాన కాలువపై ఆక్రమణలకు ముందు



కాలువపై ఆక్రమణల తర్వాత..

జగదాంబ: పందుపుల్లల సందులో జీవీఎంసీ ప్రధాన మురుగు కాలువ నిర్వహణ లోపం కారణంగా నిత్యం రహదారి పక్కన ఉన్న కాలువలు, యూజీడీలు పొంగి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ వెనుక పందుపుల్లల సందులో ఎనిమిది అడుగుల వెడల్పు, పది అడుగులకు పైగా లోతు ఉన్న ప్రధాన మురుగు కాలువ ఉంది. కేజీహెచ్ మీదుగా వచ్చే మురుగు నీరు ఈ ప్రధాన కాలువ నుంచి ప్రవహించి కెనాల్ ద్వారా సముద్రంలోకి వెళ్తుంది. అయితే పందుపుల్లల సందులో వస్త్ర వ్యాపారులు కాలువను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకోవడం వలన పారిశుధ్య కార్మికులు కాలువలో వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయలేకపోతున్నారు. ఈ కారణంగా ప్రధాన రహదారుల్లో కాలువలు, యూజీడీలు పొంగి మురుగునీరు రహదారులపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జోరందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



సీతంరాజు సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న నీలాపు రమణారెడ్డి తదితరులు

డాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలంటూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం నియోజకవర్గ పరిధి 39వ వార్డులో ప్రచారం చేపట్టారు. పాతపోస్టాఫీస్ సమీపాన గల ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల, ఎంవీడీఎం, వైఎస్సార్ అర్బన్ క్లినిక్–2, వార్డు పరిధిలో గల 5 సచివాలయాలు, కోటవీధి, అంబుసరంగ్ వీధి, థామసన్ స్ట్రీట్, కన్వేయర్ బెల్ట్, షాదీఖానా, లక్ష్మీటాకీస్ జంక్షన్, చిలకపేట, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి గ్యాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. పట్టభద్రులు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని డోర్ స్టిక్కర్, ప్రచార కరపత్రాలు అందజేశారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సనపల రవీంద్రభరత్, ముజీబ్‌ఖాన్, బాబ్జి, కృష్ణ, ఆదినారాయణ, సలీం, బొడ్డేటి కిషోర్, ప్రసాద్, రామరాజు పాల్గొన్నారు.

34వ వార్డులో..

అల్లిపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. సీఎం జగన్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి గురువారం జెండాచెట్టువీధి, భూపేష్‌నగర్, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లండా రమణ, సచివాలయ కన్వీనర్లు భాస్కరరావు, రిజ్వాన్, దేవి, నర్సింగరావు పాల్గొన్నారు.

సౌత్ జైలురోడ్డులో..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ పార్టీ సీనియర్ నాయకులు నీలాపు రమణారెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి 32వ వార్డు పరిధి సౌత్ జైలురోడ్డులో గురువారం ప్రచారం చేశారు. విద్యావంతుడు అయిన సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు అందజేశారు.

సీతంరాజును భారీ మెజారిటీతో గెలిపించాలి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి, సంక్షేమం–అభివృద్ధి రెండూ రెండు కళ్లుగా భావించి సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ సమీపాన గల అంకోశా గెస్ట్ హౌస్‌లో గురువారం అభ్యర్థి సీతంరాజు సుధాకర్, నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు, క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, రెల్లి కుల చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్, పలు వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

జ్ఞానాపురంలో..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో సుబ్బలక్ష్మినగర్, న్యూకాలనీ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా గురువారం ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



పట్టణ ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు, బయోమెట్రిక్ వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. పీఎం పాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో రిజిస్టర్లు తనిఖీ చేశారు. మందుల నిల్వను పరిశీలించారు. గర్భిణులకు ప్రయాణ సదుపాయం కల్పించాలని, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు శశిభూషణ్, బి.నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూలుపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: ఆస్తి పన్నుకు సంబంధించి మొండి బకాయిలు వసూలు చేయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. గురువారం ఆయన జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్చి 31 నాటికి జోన్ పరిధిలో ఆస్తి, నీటి, ఇంటి, ఖాళీ స్థలాలకు సంబంధించిన అన్ని పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. ఇప్పటి వరకు పన్ను కట్టని వారు, నోటీసులు జారీ చేసినా స్పందించని మొండి బకాయిదారులను గుర్తించి వారికి ఆఖరిసారిగా నోటీసులు జారీ చేయాలన్నారు. అప్పటికీ పన్నులు చెల్లించకపోతే జప్తు నోటీసులు జారీ చేయాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్సులు తీసుకోకుండా వ్యాపారాలు చేసుకునే వారిని కూడా గుర్తించి వెంటనే ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాలన్నారు. వారు ఎన్ని సంవత్సరాలుగా వ్యాపారాలు చేస్తున్నారో విచారణ చేసి మొత్తం నగదును జీవీఎంసీకి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెక్రటరీలతో పాటు సంబంధిత ఆర్‌వోలు, ఆర్ఐలు, ట్యాక్స్ కలెక్టర్లు విధిగా బయటికి వెళ్లి పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మిన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబకు వార్షికోత్సవ పూజలు



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు

ఆరిలోవ: ఆదర్శనగర్ దరి డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 7వ తేదీ వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 7న ప్రధాన జాతర జరగనుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్ తెలిపారు.

కళలతో సమాజంలో గుర్తింపు



బాలురు ప్రదర్శించిన నాటికను తిలకిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: కళలు సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు నవరస మూర్తి బాలురకు నెల రోజుల పాటు నటనలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'తప్పు తెలిసింది' నాటికను బులికృష్ణ ఆసక్తిగా తిలకించారు. అనంతరం నటనలో తర్ఫీదు పొందిన బాలురకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతైనా అవసరమన్నారు. నటనలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి సందేశాత్మకమైన నాటిక ప్రదర్శించారని అభినందించారు. చెడు స్నేహంతో ఎలాంటి దుష్పరిణామాలు ఎదురయ్యాయో అనే సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారన్నారు. శిక్షణ ఇచ్చిన అసోసియేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, అతిథులు తలసాని కృష్ణప్రసాద్, అబ్దుల్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం హారతి సమర్పించారు. అనంతరం గంటా శ్రీనివాసరావు, నాగరత్నం దంపతులు, సాయిదాక్షాయనిల ఆర్థిక సాయంతో పేదలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం బాబా భజన, పల్లకీ సేవ జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పల్లకీ మోశారు. కార్యక్రమాల్లో మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేష గిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ స్కూల్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ప్రకృతి ధర్మమైన గొలుసు కట్టు విధానంలో మనిషి, భూగోళం మనుగడకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. మార్చి 3న 50వ వన్యప్రాణి దినోత్సవ నినాదాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే ఎడ్వంటిస్ట్ స్కూల్, ఏఎస్ రాజా మహిళల జూనియర్ కళాశాల, శివాజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వాములు కండి' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భూమి మీద ఉన్న వన్యప్రాణులు, మొక్కలు భూమి మనుగడకు, మనిషి ఆరోగ్య పరిరక్షణకు ఎలా కారణమవుతున్నాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని మెడగాస్కర్, ఏఎస్ రాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్ హెచ్ఎం బీకేడీ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వన్యప్రాణి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు.

మర్యాదపూర్వక కలయిక



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023లో పాల్గొనేందుకు గురువారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రుషికొండలోని రాడిసన్‌బ్లూ



హోటల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఔదార్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. 36వ వార్డు రంగిరీజువీధిలో నివసిస్తున్న బంగారి సత్యం భార్య రెండు రోజుల కిందట స్ట్రోక్ వచ్చి బుధవారం రాత్రి మృత్యువాత పడ్డారు. వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఉదయం బంగారి సత్యం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. 33వ వార్డు బంగారమ్మ మెట్ట ప్రాంతానికి చెందిన పెద్దపూడి రాంబాబు బార్బర్ షాపు నిర్వహించేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన గురువారం మృత్యువాత పడ్డాడు. పార్టీ కార్యకర్తల ద్వారా సమాచారం తెలుసుకుని తన సొంత నిధుల నుంచి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రమణమ్మ, సుధాకర్, గౌతమ్, శ్రీనివాస్, ధనాల రాంబాబు, నీలమ్మ వేపచెట్టు ఆలయ చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మం, బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



కాలువ శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు

జగదాంబ: 'గుడ్ మార్నింగ్ కార్పొరేటర్' కార్యక్రమంలో వార్డు సమస్యలు పరిష్కరిస్తున్నామని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. పండావీధి, దుర్గమాంబ సమాజంలో డ్రైనేజీ, యూజీడీ లీక్‌ల కారణంగా దుర్గంధం వెలువడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో వార్డు పర్యటనలో భాగంగా సమస్యను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయగా.. తక్షణం సమస్య పరిష్కారం అయిందన్నారు. వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని కార్పొరేటర్ విల్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడికి సత్కారం



మన్యాలను సత్కరిస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

డాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మన్యాల శ్రీనివాస్‌ను పార్టీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు గురువారం పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా మన్యాల మాట్లాడుతూ బీసీ సెల్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, పార్టీ అభివృద్ధికి, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, బీసీ సెల్ కార్యదర్శి బొండాడ వెంకట్రావు, ఆరుగుల రాజ్‌కుమార్, బొట్ట రాము, కిరణ్, బోర అప్పలరెడ్డి, మజ్జి అప్పలరాజు, వాకాడ రాజు, మాణిక్యం శ్రీను, రవి, మహేష్, పీతల శ్రీను, ఉమా మహేష్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు గిరిజన చిన్నారులు



శిబిరంలో చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు

మహారాణిపేట : మన్యంలో పిల్లలను అత్యవసర చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. డీఎంఈ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పీడియాట్రిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల మన్యంలోని గిరిజన ప్రాంతాల్లో ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో డాక్టర్ భాస్కరరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నివేదిత, డాక్టర్ జి.హాసంతి తదితరులు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 360 మంది బాలురు, 310 మంది బాలికలను పరీక్షించారు. 46 మంది పిల్లలకు శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు గుర్తించారు. వీరిని కేజీహెచ్‌కు తీసుకురావాలని వైద్యుల బృందం సూచించింది. పాడేరు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్, గిరిజన సెల్ కోఆర్డినేటర్ ఎం.రామకృష్ణ సహకరించినట్లు కేజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో భానుప్రకాష్‌కు కాంస్యం

సీతంపేట: ఇటీవల పశ్చిమ బెంగాల్లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో నగరానికి చెందిన క్రీడాకారుడు పుప్పాల భానుప్రకాష్ ప్రతిభ చూపాడు. 45 ఏళ్లు నిండిన కేటగిరీలో హైజంప్‌లో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌ను సోషల్ మీడియా క్లబ్ స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి అభినందించారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు.